క్లుప్తంగా

వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

చాపాడు : అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తానని, భక్తులు కూడా సహకరించాలని ఆలయ ఈఓ పెరుగు వీరనారాయణ యాదవ్ పేర్కొన్నారు. మండలంలో ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో వీరభద్రస్వామి, భద్రకాళిమాత ఉత్సవ విగ్రహ మూర్తులకు భక్తుల నడుమ పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు.

మొదటి ఉభయం ఇచ్చిన కృష్ణమ్మ కుటుంబం

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో దశరా సందర్భంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మొదటిరోజు ఉభయం మహిళా ఆర్థిక సంస్థ మాజీ చైర్‌పర్సన్ కృష్ణమ్మ కుటుంబం ఇచ్చింది. ఆలయం నుండి మేళతాళాలతో వచ్చిన కమిటీసభ్యులు రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, మాజీ జడ్పీటీసీ శారదమ్మ, డాక్టర్ మార్కారెడ్డి, చైతన్యరెడ్డి తదితర కుటుంబసభ్యులను ఊరేగింపుగా దేవస్థానానికి తీసుకెళ్లారు. దేవస్థానంలో ఉభయం ఇచ్చి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మున్సిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కేశవరెడ్డి

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బద్వేలు మున్సిపాలిటీ చిన్నకేశంపల్లె గ్రామానికి చెందిన గాజులపల్లికేశవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి సోమవారం ఆయనకు నియామక పత్రం అందింది. గతంలో ఈయన మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల ఇన్‌చార్జిగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు.

యూరియా కోసం అవస్థలు

చాపాడు : మండల వ్యాప్తంగా వరి సాగు చేసుకున్న రైతులకు రోజులు గడుస్తున్న యూరియా అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రమైన చాపాడులోని ప్రైవేటు ఎరువుల దుకాణాల వద్ద సోమవారం యూరియా పంపిణీ చేపట్టారు. పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులకు మాత్రమే ఇవ్వడంతో కౌలుకు భూములు సాగు చేసుకున్న రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు

ప్రొద్దుటూరు క్రైం : ఒక వ్యక్తి మరణానంతరం చేసే నేత్రదానంతో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు వస్తుందని రక్త, నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుడు పల్లవోలు రమణ తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని చౌడూరు గ్రామానికి చెందిన నల్లగొండు కృష్ణారెడ్డి (75) అనారోగ్యంతో మృతి చెందడంతో రమణ చొరవతో అతని కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. కృష్ణారెడ్డి కార్నియాలను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ప్రతినిధి ప్రశాంత్ సోమవారం సేకరించారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం అందిస్తున్నవైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక దేవాంగపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు నైవేత, సుదేష్ణ, వసుధ, ఆప్తాలమిక్ అసిస్టెంట్ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై నివారణపై అవగాహన

పోరుమామిళ్ల : యువతా మేలుకో కార్యక్రమంలో భాగంగా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశానుసారం కడప పోలీస్ కళాజాత బృందం పోరుమామిళ్ల వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సోమవారం మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి వల్ల జరిగే నష్టం వివరిస్తూ, వాటి నుండి ఎలా బయట పడాలి అన్న సందేశంతో నాటక ప్రదర్శన ఇచ్చారు.

చుట్టపు చూపుగా ఎంపీడీఓ విధులు

గోపవరం : మండల అభివృద్ధి అధికారి చుట్టం చూపుగా విధులు నిర్వర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎం.రామనాథరెడ్డి రెగ్యులర్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రాజుపాలెం మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఎక్కువ రోజులు రాజుపాలెంలోనే విధులు నిర్వర్తిస్తుండటంతో రెగ్యులర్‌గా ఉన్నచోట చుట్టం చూపుగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివిధ అవసరాల కోసం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్ళిన ప్రజలు ఎంపీడీఓ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఆరు గ్రామ సచివాలయాలు ఉండగా పరిపాలన విధంగా, ఉపాధి హామీ పథకానికి కూడా ఎంపీడీఓనే పర్యవేక్షించాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో రెగ్యులర్ ఎంపీడీఓ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెగ్యులర్‌గా ఇక్కడే విధులు నిర్వర్తించే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లోకరక్షాకరి.. శ్రీరాజరాజేశ్వరి

దసరా పురస్కరించుకుని శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను భక్తులు విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయాల్లో కొలువైన శక్తి స్వరూపిణీలకు విశేష పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారి సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం అమ్మవార్లను విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కాగా పసిడి పురి ప్రొద్దుటూరులో శ్రీ మత్కన్యకా పరమేశ్వరి దేవీ శరన్నవరాత్రి ఉత్సవ శోభ కనిపించింది. కన్యకాంబ రాజరాజేశ్వరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించింది. ఉత్సవాలు ప్రారంభమవ్వడంతో పట్టణమంతా సందడి వాతావరణం కనిపించింది. ప్రధాన కూడలిలో భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

– సాక్షి, నెట్‌వర్క్


ప్రొద్దుటూరు కల్చరల్ : శివాలయంలో రాజరాజేశ్వరిదేవి



ప్రొద్దుటూరు కల్చరల్ : రాజరాజేశ్వరిదేవి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి


కలసపాడు: బాలత్రిపురసుందరిదేవి అలంకారంలో అమ్మవారు


ప్రొద్దుటూరు కల్చరల్ : రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ..


ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్నకేశస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవి



పోరుమామిళ్ల: బాలా త్రిపురసుందరీదేవిగా కోట పోలేరమ్మ


బద్వేలు అర్బన్ : అమ్మవారిశాలలో విశ్వమాతదేవి అలంకారంలో..


మైదుకూరు: రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు


ప్రొద్దుటూరు: అలంకరణలో పెద్దమ్మ తల్లి


శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారం


ఖాజీపేట: దీక్షాబంధన అలంకరణలో అమ్మవారు


బద్వేలు అర్బన్ : మహాలక్ష్మి ఆలయంలో ఆదిలక్ష్మీదేవి అలంకారం..


ప్రొద్దుటూరు కల్చరల్ : చౌడేశ్వరిదేవి ఆలయంలో రాజరాజేశ్వరి


మాజీ ఎమ్మెల్యే రాచమల్లుకు అమ్మవారి చిత్రపటాన్ని అందచేస్తున్న బుశెట్టి రామ్మోహన్


రాజుపాళెం: 108 (కలశాలు) బిందెసేవ కార్యక్రమంలో మహిళలు


బ్రహ్మంగారిమఠంలో కలశోత్సవంలో పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, భక్తులు


బద్వేలు అర్బన్ : వెండి కలశాలతో అమ్మవారిని అభిషేకించేందుకు వస్తున్న మహిళలు


బ్రహ్మంగారిమఠం: అమ్మవారిశాలకు కలశాలతో వెళుతున్న అధ్యక్షుడు, మహిళలు

మౌలిక వసతులు కల్పించాలని మహాధర్నా

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సుందరయ్యనగర్, ఐలమ్మకాలనీ, జ్యోతిబసుకాలనీ, మహమ్మద్‌కాలనీలలో నివసించే ప్రజల సమస్యలను పరిష్కరించకుంటే త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పాలక పార్టీకి ప్రజల సత్తా ఏమిటో చూపుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట పేదల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జనాభాలో 30 శాతం ప్రజలు కమ్యూనిస్టులు వేసిన కాలనీలలో జీవిస్తున్న వాస్తవాన్ని పాలకులు, ఉన్నతాధికారులు గమనించాలని కోరారు. సుమారు 25 సంవత్సరాలుగా ఆయా కాలనీల్లో పేద ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నా నేటికీ వారికి మౌళిక వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాను కామన్‌మ్యాన్ అని ప్రతిరోజు మీడియాలో చెబుతుంటారని, ఇక్కడి కామన్‌మ్యాన్ కష్టాలు స్థానిక టీడీపీ నేతలు చంద్రబాబు దృష్టికి ఎందుకు తీసుకెళ్ళడం లేదని ప్రశ్నించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు చాంద్‌బాష, పట్టణ కార్యదర్శి శ్రీను, పట్టణ కమిటీ సభ్యులు చిన్ని, సుబ్బరాయుడు, బాబు, శివ, మోక్షమ్మ, ఖైరున్‌బీ, ఆయా మండలాల కన్వీనర్లు, శాఖాకార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

యూరియా కొరతపై సమాధానం చెప్పాలి

దువ్వూరు (చాపాడు) : వైఎస్సార్ కడప జిల్లాలో యూరియా కొరత ఉందని అసెంబ్లీలో సోమవారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వెల్లడించడంతో యూరియా కొరత ఉందన్న విషయం బట్టబయలైందని, యూరియా కొరత లేదని సీఎం చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పదేపదే అవాస్తవాలు మాట్లాడడంపై సమాధానం చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. దువ్వూరు మండలం గుడిపాడు గ్రామంలోని సింగిల్ విండో మాజీ చైర్మన్ తుమ్మల మస్తాన్‌రెడ్డితో కలసి సోమవారం మాట్లాడుతూ చంద్రబాబు, అచ్చెన్నాయుడు నియోజకవర్గాల్లో కూడా రైతులకు యూరియా దొరకడం లేదని వాపోతున్నారని తెలిపారు. రైతులు యూరియా కోసం క్యూలో నిలబడ్డారని మాజీ సీఎం వైఎస్ జగన్ మాట్లాడితే దానిపై రాద్ధాంతం చేసిన కూటమి నేతలు.. నంద్యాల వరదరాజులరెడ్డి వాఖ్యలపై సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. దువ్వూరులో ఎరువులను బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రబీలోనైనా రైతాంగానికి ఎరువులు ఇవ్వాలని, లేకుంటే రైతాంగం పక్షాన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని రెడ్యం హెచ్చరించారు.


మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

హామీలు విస్మరించిన విద్యాశాఖమంత్రి

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే విద్యార్థులందరికి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని విద్యాశాఖామంత్రి నారాలోకేష్ విస్మరించారని అఖిల భారత విద్యార్థి అసోసియేషన్ జిల్లా నాయకులు బి.అనిల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎంతో మంది విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కాలేజీలకు వెళితే ఫీజు బకాయిల కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితి ఉందని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి మాత్రమే సమాజ రూపకల్పన అని చెప్పిన ప్రభుత్వం నేడు వైద్యరంగాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. తక్షణమే విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యువజన సంఘం నాయకులు నారాయణ, ఏఐఎస్ఏ నాయకులు బన్నీ, చరణ్, అభిరామ్, చరణ్, దాసు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐఎస్ఏ జిల్లా నాయకులు అనిల్

పనిగంటల పెంపుపై సీఐటీయూ నిరసన

పోరుమామిళ్ల: కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచడాన్ని అంగీకరించమని సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో సుదీర్ఘ పోరాటం, ఎందరో ఆత్మ బలిదానంతో 139 సంవత్సరాల క్రితం సాధించుకున్న 8 గంటల పనిని కూటమి ప్రభుత్వం కాలరాస్తూ 13 గంటలకు పెంచడం కార్మికుల హక్కులకు మరణ శాసనమన్నారు. పాలకుల నిరంకుశ పోకడలు మళ్లీ మేడే ఆవిర్భావం నాటి పరిస్థితులు పునరావృతం కానున్నాయా? అనిపిస్తున్నదన్నారు. కార్మికుల శారీరక, మానసిన ఆరోగ్యం ప్రమాదంలోకి నెట్టబడుతోందన్నారు. పని గంటల కాల పరిమితి పెరిగితే కార్మికవర్గం తమ సాంఘిక జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని కోల్పోతుందన్నారు. స్వదేశీ, విదేశీ బడా కార్పోరేట్ల ప్రయోజనాలు నెరవేర్చేందుకేనన్నారు. కార్మికులు తమను తాము విముక్తి చేసుకోవాలంటే ఐక్యంగా, సంఘటితంగా పోరాడాలన్నారు.

సెలవుల్లో గ్రంథాలయం సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల: దశరా సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ అఫ్రిది, ఉపాధ్యాయుడు ఖాశీంవలి పిలుపునిచ్చారు. సోమవారం వారు మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీ, సినిమాలతో కాలక్షేపం చేయకుండా గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానవంతులు కావాలన్నారు. గ్రంథాలయంలో క్విజ్, డ్రాయింగ్, కథలు, పాడటం తదితర కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చూపాలన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

బద్వేలు అర్బన్ : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసాలు పెంపొందుతాయని ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ అధికారి పి.నరేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ విభాగానికి విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఫిజికల్, మెడికల్ పరీక్షల ఆధారంగా 60 మంది విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవతో పాటు దేశ సేవ చేయాలనుకునే వారికి ఎన్‌సీసీ విభాగం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ రాచపూడివెంకటసాయికృష్ణ, ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ అధికారి అరుణ్‌కుమార్, కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓలు రఘువీర్, లెఫ్టినెంట్ బాలఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు

ఖాజీపేట : ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఖాజీపేట సీఐ వంశీధర్ హెచ్చరించారు. పాటిమీద పల్లె గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారంతో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో ఒక దుకాణంలో 10 మద్యం బాటిళ్లు, 5 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మద్యం విక్రయిస్తున్న ఏరుకలయ్య అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని చెప్పారు.

ఎమ్మెల్యే పరామర్శ

అట్లూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశాంత్రి తీసుకుంటున్న కమలకూరు సర్పంచ్ చిట్టిబోయిన సుబ్బయ్యను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పరామర్శించారు. అతడి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అలాటగే వలసపాలెం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉప్పాతి రామసుబ్బారెడ్డి ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకొన్న విషయం తెలిసి అతడిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గంగిరెడ్డి, ఇంటిలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రటరీ వడమాను సుబ్రహ్మణ్యేశ్వరరావు, చెంచునాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

రామసముద్రంలో స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు పీహెచ్‌సీ పరిధిలోని రామసముద్రం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సోమవారం స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆదిలక్షుమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తారని, గర్భవతులకు ఉచిత పరీక్షలు, క్యాన్సర్, బీపీ, షుగర్, టీబీ పరీక్షలు, కిశోర బాలికలకు ఉచిత పరీక్షలు, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులపై అవగాహన, మాతాశిశు సంరక్షణ సేవలు అందిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, ఎంఎల్‌హెచ్‌పీ జయంతి, ఏఎన్ఎం రమాదేవి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

వరద బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

రాజుపాళెం : వరద వచ్చి గ్రామంలోని ఇళ్లలోకి వర్షం నీరు వచ్చి చాలా రకాలుగా కాలనీ వాసులు నష్టపోయారని, అయితే ఇంతవరకు ఎటువంటి సాయం అందివ్వలేదని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ అన్నారు. ఆ గ్రామంలోని కాలనీలోని వరద బాధితులతో కలిసి సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు పూర్తిగా తడిచి పోయాయన్నారు. దీంతో సంబంధిత అధికారులు తినేదానికి తిండి గింజలు కూడా అందించలేదని వాపోయారు. రెవెన్యూ ఉన్నతాధికారులు కాలనీలతో పాటు గ్రామాన్ని సందర్శించారని, అయితే ఇంత నష్టం జరిగినా ఎటువంటి సాయం ఇవ్వకపోవడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నీటిలో గడ్డి వాములు పూర్తిగా నీట మునిగాయని, మూగజీవాలు సైతం మృత్యువాత పడినా ఇంతవరకు పరిహారం ఇవ్వలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకొని, వరదల్లో నష్టపోయిన వారికి తక్షణమే సాయం అందించాలని జగన్ కోరారు.


పర్లపాడులో నిరసన తెలుపుతున్న జగన్, మహిళలు

ప్రైవేటు టీచర్లకు దసరా సెలవులివ్వాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వ ఉపాధ్యాయుల తరహాలోనే ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వాలని డీవైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరికుమార్, విశ్వనాథ్ తెలిపారు.

సోమవారం విలేకరులతో మాటాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించినా జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించడంలేదన్నారు. తప్పకుండా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధులకు రాకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. వర్క్‌షాపులు, స్టడీ అవర్స్, పేపర్ కరెక్షన్ పేరుతో పాఠశాలలకు ఉపాధ్యాయులు రావాలని చెబుతుండటాన్ని తప్పుబట్టారు. చాలీచాలని జీతాలతో ఉద్యోగ భద్రత లేక చదువుకున్న చదువుకు సరైన ఉద్యోగం రాక ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తుంటే యాజమాన్య వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. బలవంతంగా ప్రైవేటు పాఠశాలలు నడిపితే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మహర్షి స్కూల్ స్థలాన్ని అన్యాక్రాంతం కానివ్వను

- తనకు వస్తుందంటే ధర్నాకు దిగుతానా?
- ఉక్కు ప్రవీణ్‌కు చిత్తశుద్ధి ఉంటే సీఎంకు తెలియజేసి విచారణ జరిపించాలి
- వివాదాస్పద భూమిలో ప్లాట్లు వేసి విక్రయిస్తే ప్రజలు కొని మోసపోవద్దు
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : బొల్లవరంలోని మహర్షి విద్యా మందిరం స్కూల్ స్థలాన్ని అన్యాక్రాంతం కానివ్వనని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ స్థలం వ్యవహారంలో తనకు గానీ, తన కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రమేయం లేదన్నారు. తన నివాసంలో సోమవారం రాచమల్లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బొల్లవరంలో 1973లో మహర్షి విద్యామందిరం స్కూల్‌ను ఏర్పాటు చేశారన్నారు. అయితే ఈ పాఠశాల నిర్విరామంగా నడుస్తుండటంతో బొల్లవరానికి చెందిన కందుల బాలనారాయణరెడ్డి కుమారుడు కందుల నరసింహారెడ్డి 1978లో మహర్షి విద్యామందిరం స్కూల్‌ను ఏర్పాటు చేసిన ఉత్తరప్రదేశ్, రుషికేశ్‌లోని మహర్షి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ ఇంటెలిజెన్స్ అనే సంస్థకు 1.15 ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చారన్నారు. స్థలాన్ని బదిలీ చేసే సమయంలోనే తన వారసులకు భవిష్యత్తులో భూమిపై ఎలాంటి హక్కు ఉండదని రాశారన్నారు. అయితే రుషికేశ్‌లోని మహర్షి క్రియేటివ్ ఇంటెలిజెన్స్ సొసైటీ నుంచి 1.15 ఎకరాలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన ముఖ్య అనుచరుడు వంగల నారాయణరెడ్డిలు కలిసి రూ.2 కోట్లకు కొనుగోలు చేశారని చెప్పారు. భూమి విషయంలో తనకు సంబంధం లేకున్నా కందుల నరసింహారెడ్డి వారి అన్నదమ్ముల పిల్లలు కోర్టులో తనపై కేసు వేశారని, తరువాత ఎమ్మెల్యే వరద, ఆయన అనుచరుడు కొంత మొత్తం అందించడంతో కోర్టులో కేసును ఉపసంహరించుకున్నారని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే, ఆయన అనుచరుడు భూమిని రిజిస్టర్ చేయించుకునేలా కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. 21ఏ(మంగలి ఇనాం భూమి)లో ఉన్న భూమిని రిజిస్టర్ చేయడానికి కలెక్టర్ నిరాకరించడంతో స్థలం రిజిస్టర్ కాకుండా నిలిచిపోయిందని తెలిపారు. మహర్షి విద్యామందిర్ స్థలంలో ప్లాట్‌లు వేయడానికి అవకాశంలేదని స్పష్టం చేశారు. అధికార అండతో అక్రమంగా ప్లాట్‌లు వేసిన ప్రజలు నమ్మిమోసపోవద్దని సూచించారు. దొంగ సొసైటీ స్థాపించి స్థలాన్ని బదాలయించేలా పావులు కదిపి వందల కోట్లు విలువ చేసే స్థలాన్ని కారుచౌకగా కాజేసేందుకు ఎమ్మెల్యే వారి మనుషుల పన్నాగాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. అక్కడ పాఠశాల మాత్రమే ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

25న హైకోర్టులో పిల్ వేస్తున్నా

మహర్షి విద్యామందిరం స్కూల్‌కు చెందిన 1.15 ఎకరాల స్థలం అన్యాక్రాంతం కాకుండా అడ్డుపడేందుకు ఈ నెల 25న కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేయనున్నట్లు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థలాన్ని కాపాడేందుకు 2023లో స్థలం రిజిస్టర్ కాకుండా అడ్డుకోవడమే కాక ధర్నాకు కూడా దిగానని అలాంటి తన పైనే టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రచారం చేశాడని చెప్పారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో స్థలాన్ని ఎలాగైనా పొందాలని చూస్తున్నారని, వాడు అడ్డుకోవడాన్ని తాను సమర్థిస్తున్నానని, అలానే ప్రవీణ్‌రెడ్డి లలూచీ పడకుండా సీఎం చంద్రబాబుకు విషయాన్ని తెలియజేసి విచారణ చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, పార్టీ ప్రొద్దుటూరు మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.